



**అక్కడ జరుగుతున్న క్రికెట్ మ్యాచ్ మంచి రసకందాయంలో పడింది. ఇంకో 15 పరుగులు చేస్తే బి.ఎస్సీ ఫైనలియర్ టీం గెలుస్తుంది. ఇంకో మూడు ఓవర్లు, మూడు వికెట్లు మాత్రమే మిగిలి ఉన్నాయి. బి.ఏ. ఫైనలియర్ టీం మొదట బ్యాటింగ్ చేసి 20 ఓవర్లలో 88 పరుగులు చెయ్యగల్గింది. బి.ఎస్సీ ఫైనలియర్ టీంలోని శంకర్ ఒక్కడే 6 వికెట్లు పడగొట్టాడు. శంకర్‌కు ఆల్‌రౌండర్‌గా మంచి గుర్తింపు ఉంది. ఆ తర్వాత బ్యాటింగ్‌కు దిగిన బి.ఎస్సీ ఫైనలియర్ టీం యేడు వికెట్లు కోల్పోయి 74 పరుగులు చేసింది. ఈ 74 పరుగుల్లో అన్వేష్ ఒక్కడే 40 పరుగులు చేసి ఇంకా నాటౌట్‌గానే క్రీజులో ఉన్నాడు. ఆరో వికెట్ పడిపోయాక శంకర్ బ్యాటింగ్ చెయ్యడానికి అన్వేష్‌తో కలిశాడు.**

శంకర్‌కు చాలా దూకుడుగా ఆడ్తాడన్న పేరుంది. అతడు బ్యాటింగ్ చెయ్యడానికొచ్చాడంటే సిక్స్‌లు, ఫోర్లు అతని బ్యాట్ నుండి ప్రవహిస్తాయని మ్యాచ్ చూస్తున్న వాళ్ళు అనుకుంటారు. అందుకే శంకర్ బ్యాటింగ్ చెయ్యడానికొస్తున్నాడనగానే ఆ మ్యాచ్ చూస్తున్న ప్రేక్షకులంతా కరతాళధ్వనులతో అతనికి స్వాగతం చెప్పారు.

బి.ఎస్సీ ఫైనలియర్ టీం గెలవాలంటే శంకర్, అన్వేష్‌లిద్దరూ చివరి ఓవర్ వరకు నిలిచి ఉండాలని ఆ మ్యాచ్ చూస్తున్న వాళ్ళందరూ ఆశించారు.

18 ఓవర్ మొదటి బంతిని శంకర్ ధాటిగా ఎదురుకొని మిడ్ వికెట్ మీదుగా బౌండర్ అవతలకు లేపేశాడు. మ్యాచ్ చూస్తున్న విద్యార్థులంతా 'సిక్సర్' అంటూ పెద్ద పెట్టున అరిచారు.

నాన్ స్ట్రైకర్ ఎండ్‌లో ఉన్న అన్వేష్ వెంటనే శంకర్ దగ్గర కొచ్చి అతనితో చేతులు కలిపి అతని చెవిలో యేదో చెప్పాడు.

తర్వాత బంతిని శంకర్ థర్డ్‌మ్యాన్ దిశగా తరలించి ఓ సింగిల్ తీసుకున్నాడు.

ఇప్పుడు ఆడే ఛాన్స్ అన్వేష్ కొచ్చింది. అన్వేష్ ఆ బంతిని స్ట్రైట్ డ్రైవ్ చేశాడు. సింగిల్ తీసుకుందామని శంకర్‌ను

పిల్చాడు. శంకర్ వెంటనే పరిగెత్తాడు. కానీ అన్వేష్ కొట్టిన బంతిని ప్రత్యర్థి జట్టులో ఆడుతున్న ఓ ఫీల్డర్ డైవ్‌చేసి ఆపేశాడు. అది చూసిన అన్వేష్ 'నో' అని అరిచాడు. అప్పటికే శంకర్ చాలాదూరం పరిగెత్తాడు. వెనక్కి వెళ్ళే అవకాశమేలేదు. ఈలోగా ప్రత్యర్థి ఫీల్డర్ విసిరిన బంతి స్టంప్స్‌కు తగిలి బెయిల్స్ కింద పడిపోయాయి. శంకర్ రనౌట్ అయిపోయి పెవిలియన్ వైపు నడిచాడు.

మ్యాచ్ చూస్తున్న వాళ్ళంతా తమకళ్ళను తాము నమ్మలేకపోయారు.

శంకర్ కనీసం ఇంకో రెండు మూడు సిక్సర్లయినా బాదేస్తాడని వాళ్ళు ఆశించారు.

అన్వేషే కావాలని శంకర్‌ను రనౌట్ చేయించాడని కూడా కొందరన్నారు.

''వాళ్ళిద్దరు చాలా దగ్గరి మిత్రులు కదా! అన్వేష్ అలా ఎందుకు చేస్తాడ''ని మరికొందరన్నారు.

తర్వాత వచ్చిన బ్యాట్స్‌మన్‌కు బ్యాటింగ్ బొత్తిగా రాదు, అయినా అతడు కొంతసేపు క్రీజులో నిల్చోగలిగాడు. సింగిల్స్, టూస్ చేస్తూ అన్వేష్ చివరి ఓవర్లో ఓ బౌండరీ కొట్టి తన జట్టును గెలిపించగల్గాడు. ఆలోగా అతడు తన అర్ధసెంచరీని కూడా పూర్తి చేశాడు.

మ్యాచ్ పూర్తికాగానే బి.ఎస్‌సీ ఫైనలియర్ స్టూడెంట్స్ గ్రౌండ్‌మీదకు పరిగెత్తుకొని వచ్చి అన్వేష్‌నే తమ భుజాల మీదకు ఎక్కించుకొని గ్రౌండ్ చుట్టూ తిప్పారు. మ్యాచ్ చూస్తున్న వాళ్ళంతా ''అన్వేష్'' ''అన్వేష్'' అని చప్పట్లు కొడ్తూ అన్వేష్‌కు జేజేలు పలికారు.

అన్వేష్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. తన జట్టుకు కెప్టెన్ కూడా అతడే కాబట్టి గెలిచిన జట్టుకిచ్చే షీల్డు కూడా అతనికే లభించింది. ఆరు వికెట్లు తీసిన శంకర్‌ను మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు ఎందుకు రాలేదని కొందరు విద్యార్థులు ప్రశ్నించారు. క్రికెట్ బ్యాట్స్‌మెన్ కొచ్చే గుర్తింపు బౌలర్స్‌కు రాదని కొందరన్నారు.

గెల్చిన ఉత్సాహమంతా సద్దుమణిగాక వాళ్ళుండే హాస్టల్ రూమ్‌లోనే శంకర్, అన్వేష్‌లు కలుసుకున్నారు.

''థ్యాక్యూ రా శంకర్'' అన్నాడు అన్వేష్

''ఎందుకు'' అన్నాడు శంకర్

''ఎందుకో నీకు తెలుసులేరా''

శంకర్ నవ్వాడు.

''నా కోసం నీ వికెట్ త్యాగం చేశావు. నువ్వింకాస్సేపు క్రీజులో ఉంటే నీకే మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కేది. నేను హాఫ్ సెంచరీ చేసేవాడిని కాను''.

''డజంట్ మ్యాటర్... నీకోసం ఆ మాత్రం చెయ్యననుకున్నావా?''

''నువ్వు చేస్తావని తెలుసురా... క్రికెట్ నువ్వు నాకన్న బాగా ఆడగలవని కూడా తెలుసు. కానీ నా కారణంగా మన టీం గెల్చిందన్న పేరు తెచ్చుకోవాలని నా కోరిక. అందుకే నువ్వు సిక్స్‌కొట్టాక మళ్ళీ అలాంటి షాట్ కొట్టొద్దని నీకు చెప్పాను. నువ్వే మ్యాచ్ ఫినిష్ చేస్తే నాకు హాఫ్ సెంచరీ చేసే అవకాశం ఉండేదికాదు. నిజం చెప్పాలంటే నువ్వు ఎలాగైనా అవుటైతే బావుండనని కూడా నా మనసులో అనుకున్నాను. ఆ బాల్ ఫీల్డవుతుందని తెలుసు. అయినా రన్ తీసుకుందామని నిన్ను పిల్చాను. అలా నీ రనౌట్‌కు కూడా నేనే కారకుడినయ్యాను. సారీరా శంకర్...'' అన్నాడు అన్వేష్.

''ఫరవాలేదులే అన్వేష్. నన్ను నువ్వు ఎలా ఉపయోగించుకున్నా నేనేమీ అనుకోను. నువ్వు లేకపోతే నేనింతదాకా వచ్చేవాడినేకాను. యే పల్లెటూరులోనో కాయకష్టం చేసుకుంటూ బతికేవాడిని'' అన్నాడు శంకర్.

అన్వేష్ శంకర్లు వాళ్లు చదువుకుంటున్న కాలేజి వాళ్ళు నడుపుతున్న హాస్టల్లో ఒకేరూంలో ఉంటున్నారు., చాలా చిన్నప్పట్నించే వాళ్ళిద్దరి మధ్య ఓ బలీయమైన అనుబంధం యేర్పడింది.

వాళ్ళిద్దరిదీ ఒకే ఊరు.

అన్వేష్ ఆ ఊర్లోకల్లా ధనవంతులని పేరు పొందిన వాళ్ళ కుటుంబంలో జన్మించాడు.

శంకర్ అట్టడుగు వర్గానికి చెందిన ఓ నిరుపేద దళిత కుటుంబంలో జన్మించాడు.

చిన్నప్పట్నించీ అన్వేష్‌కు ఆటలంటే చాలా ఇష్టం. ఒకటో తరగతిలోనే అన్వేష్, శంకర్లు క్లాస్‌మేట్స్ అయ్యారు.

ఒకరోజు స్కూలు ఆవరణలోనే శంకర్ గోళీలాట ఆడుతుండగా అన్వేష్ చూశాడు. శంకర్‌కు గోలీలాటలో ఉన్న నైపుణ్యం అన్వేష్‌కు ఆశ్చర్యాన్ని కల్గించింది.

శంకర్ గోలీలాటను అద్భుతంగా ఆడుతున్నాడనిపించింది. ఎంత దూరంగా ఉన్న గోలీనైనా తన గోలీతో సులభంగా కొట్టేస్తున్నాడు. అతని సూటి అనితర సాధ్యమనిపించింది.

అన్వేష్ కూడా గోలీలాడ్తాడు. కానీ శంకర్ ఆటను చూశాక అతడు ఆ ఆటలో ఎంత వెనకబడి ఉన్నాడో అతనికి అర్థమైంది.

''నాకు గోలీలాట నేర్పిస్తావా?'' అన్నాడు అన్వేష్ శంకర్‌తో.

అన్వేష్ చాలా ఉన్నత కుటుంబానికి చెందినవాడని శంకర్‌కు తెలుసు. అంతటివాడు తనను గోలీలాట నేర్పించమని అడిగినందుకు అతడు చాలా సంతోషించాడు.

''తప్పకుండా నేర్పిస్తా'' అన్నాడు శంకర్.

శంకర్ అన్వేష్‌కు గోలీలాటలోని మెలకువలన్నీ నేర్పించాడు. అప్పట్నించి వాళ్ళిద్దరు మంచి స్నేహితులుగా మారిపోయారని అందరూ అనుకున్నారు.

శంకర్ అట్టడుగు వర్గానికి చెందిన వాడని అన్వేష్‌కు తెలుసు. త్వరలోనే శంకర్‌ను ''రారా! పోరా!'' అనడం మొదలెట్టాడు. కానీ శంకర్ మాత్రం అన్వేష్‌ను ''రారా! పోరా!'' అని అనలేకపోయాడు. అన్వేష్‌ను ఎంతో గౌరవభావంతో చూసేవాడు. హైస్కూలు వరకు వాళ్ళు కలిసే చదువుకున్నారు.

శంకర్ యే ఆటనైనా చాలా సులభంగా నేర్చుకునేవాడు. ఆటల్లోనే కాకుండా చదువులో కూడా అతడు తెలివైనవాడే. మొదట్లో అన్వేష్ చదువులో నాకంటె తెలివైన వాళ్ళెవరూ తన క్లాసులో లేరు అనుకునేవాడు. కానీ యేడవ తరగతి వరకు శంకర్ అతనికంటె వెనకబడినట్లే కనిపించినా ఆ తర్వాత




శంకర్ అన్వేష్ కంటె ప్రతి పరీక్షలోనే ఎక్కువ మార్కులు తెచ్చుకోవడంతో అన్వేష్ కంగుతిన్నాడు. ఒకప్పుడు తననెంతో మెచ్చుకున్న టీచర్లందరూ ఇప్పుడు శంకర్‌ను మెచ్చుకోవడంతో అన్వేష్‌కు తలకొట్టేసినట్టుగా అనిపించింది. ''తిండిక్కూడా గతిలేని వీడేమిటి? వీడికిన్ని తెలివితేటలేమిటి?'' అన్న భావం అన్వేష్ బుర్రలో చాలాసార్లు మెదిలింది.

అయినా శంకర్‌కు అన్వేష్‌కు ఎన్నో విధాలుగా సహాయపడేవాడు. శంకర్‌కు ఎప్పుడు డబ్బులవసరం కల్గినా అన్వేష్ ఇస్తుండేవాడు. అతనికి డ్రెస్సులు కూడా అన్వేష్ కుట్టించి ఇచ్చేవాడు. ఎన్నోసార్లు తనతోబాటు హోటల్‌కు తీసికెళ్ళి తినిపించేవాడు. శంకర్‌కు పుస్తకాల్ని, నోట్‌బుక్స్‌ని కొనిచ్చేవాడు. శంకర్‌కే కాకుండా శంకర్ కుటుంబానికి కూడా అన్వేష్ ఎంతో సహాయం చేస్తుండేవాడు. శంకర్‌ను ఎప్పుడూ తన చుట్టే తిప్పుకుంటూ ఆటల విషయంలోను, చదువు విషయంలోనూ అన్వేష్ అతని సహాయాన్ని పొందుతుండేవాడు. అన్వేష్ తనకు చేస్తున్న సహాయాన్ని శంకర్ ఎప్పుడూ గుర్తు చేసుకుంటూ గొప్ప కృతజ్ఞతాభావాన్ని శంకర్ చూపిస్తుండేవాడు. అన్వేష్‌ను ప్రతివిషయంలోనూ సమర్థిస్తూ అతన్ని ఆకాశానికెత్తేస్తూ అతనికి నమ్మిన బంటులా మారిపోయాడు శంకర్. అన్వేష్‌ను ఎవరైనా విమర్శించినా, తక్కువచేసి మాట్లాడినా శంకర్ వాళ్ళను తీవ్రంగా మందలించేవాడు. ఒక్కొక్కసారి వాళ్ళమీద చెయ్యి కూడా చేసుకునేవాడు.

అన్వేష్‌కు శంకర్ మీద సంపూర్ణమైన నమ్మకం యేర్పడింది. తనవల్ల అతనికెంత లాభముందో అతనివల్ల తనకూ అంతే లాభముందని అన్వేష్ గ్రహించాడు. ఎట్టి పరిస్థితుల్లో కూడా శంకర్‌ను దూరం చేసుకోవద్దని నిర్ణయించుకున్నాడు.

''అరేయ్ శంకర్! క్లాసులో ఎప్పుడూ నువ్వే ఫస్ట్ వాలారా! నేను రాకూడదట్రా?'' అన్నాడు అన్వేష్ వాళ్ళు యేడో తరగతి చదువుతున్నప్పుడు.

''ఎందుకు రాకూడదు అన్వేష్! ఇప్పట్నించి నువ్వే ఫస్టొస్తావులే'' అన్నాడు శంకర్.


ఆ తర్వాత జరిగిన నెలవారీ పరీక్షల్లో శంకర్ కావాలని కొన్ని ప్రశ్నలకు జవాబు తెలిసినా రాయకుండా వదిలేశాడు. దాంతో అప్పట్నించి అన్వేషే ఫస్ట్ రావడం, టీచర్లందరూ అతన్ని మెచ్చుకోవడం, శంకర్‌ను చెడిపోయాడని ఈసడించుకోవడం ప్రారంభమైంది. అయినా శంకర్ బాధపడలేదు. స్నేహితుడికోసం ఈమాత్రమైనా చెయ్యకపోతే ఎలా? అనుకున్నాడు.

అన్వేష్‌ను వాళ్ళ నాయనమ్మ ఎంతో గారాబంగా పెంచింది. అన్వేష్‌కు నాలుగైదేళ్ళప్పుడే అతని తల్లి చనిపోయింది. అతని తండ్రి మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడు. అన్వేష్‌ను అతని తండ్రిగానీ, సవతి తల్లిగానీ పట్టించుకునేవాళ్ళు కారు. అతని ఆలనా, పాలనా అన్నీ వాళ్ల నాయనమ్మే చూసేది.

అన్వేష్ తండ్రి పేరు ప్రతాపరెడ్డి.

ఆయనే ఆ ఊర్లో అందరికంటే పెద్ద భూస్వామి. వ్యవసాయంతోబాటు అతడు రోడ్లు వెయ్యడం, చెరువుకట్టల్ని రిపేరు చెయ్యడంలాంటి కాంట్రాక్టు పనులు కూడా చేస్తుండేవాడు. యే రాజకీయపార్టీ అధికారంలో ఉంటే ఆ రాజకీయపార్టీతో సయోధ్య కుదుర్చుకొని కాంట్రాక్టులు సంపాదించుకొని బాగా సంపాదించాడు. ఇటీవలనే వాళ్ళూరికి నీటి పారుదల ప్రాజెక్టు నుండి కాలువ రావడంతో ఆ గ్రామంలోని వ్యవసాయ భూముల ధరలు ఆకాశాన్ని అంటుకునేలా పెరిగిపోయాయి. దాంతో ప్రతాపరెడ్డి తనకున్న కొన్ని భూముల్ని అమ్మేసి హైదరాబాద్ నగరంలో అపార్ట్‌మెంట్స్ నిర్మించి అమ్మే వ్యాపారం మొదలెట్టాడు. అతడు పట్టిందల్లా బంగారమౌతుందని అతని చుట్టూ ఉన్నవాళ్ళు చెప్పుకునేవాళ్ళు.

కొడుకు అన్వేష్‌ను ప్రతాపరెడ్డి పట్టించుకోకపోయినా అతడికెంత డబ్బు కావలంటే అంత డబ్బు ఇస్తుండేవాడు.




అన్వేష్, శంకర్లు వాళ్ళూరిలోని హైస్కూలులో పదవతరగతి చదవడం పూర్తి చేసి ఇద్దరూ ఫస్ట్‌క్లాసులో ప్యాసయ్యారు.

శంకర్ పదోతరగతిలో చదువు మానేస్తానన్నాడు.

''నాకో మేనత్త తప్ప ఎవరూ లేరు. మా అమ్మ నాన్నలిద్దరు నాకు బుద్ధి తెలియకముందే చనిపోయారు. నన్ను సిటీకి పంపించి చదివించే ఆర్థికస్తోమత మా మేనత్తకులేదు. నీ సహాయంతో నేను టెంత్ ప్యాసుకాగల్గాను. యేదన్నా చిన్న ఉద్యోగం చూసుకుంటాను'' అన్నాడు శంకర్.

''నీకు ఆర్థికస్తోమత లేకపోతే నాకుందిరా. నేనెంత వరకు చదివితే నిన్ను అంతవరకు చదివించే బాధ్యత నాది. నువ్వు నా పక్కన లేకపోతే నాకు సగం బలంపోయినట్టుంటుంది. నా సగం బలం నువ్వేరా శంకర్! నువ్వు నన్ను విడిచివెళ్ళటానికి వీల్లేదురా!'' అన్నాడు అన్వేష్.

అన్వేష్ వాళ్ళ నాయనమ్మక్కూడా శంకర్ చాలా నచ్చాడు. శంకర్ అన్వేష్‌కు అనుక్షణం శ్రీరామరక్షలా ఉంటాడని ఆమెకు నమ్మకం కల్గింది. వాళ్ళిద్దర్ని చూస్తొంటే ఆమెకు శ్రీరామచంద్రుడు హనుమంతుడు గుర్తొచ్చేవాళ్ళు.

అన్వేష్ వాళ్ల నాయనమ్మ పేరు పార్వతమ్మ. ఒకసారి పార్వతమ్మతో వాళ్ల పక్కింటి బంధువు ఒకమె.

''మీ అన్వేష్ ఆ శంకర్‌తో తిర గటమేమిటి?'' అంది. ఆమె పేరు కాంతమ్మ.

''ఎందుకు తిరగకూడదు?'' అంది పార్వతమ్మ.

''శంకర్‌ది యేంకులమో నీకు తెలుసా?'' అంది కాంతమ్మ.

''యేకులమైతేంది? ఈ రోజుల్లో కులాన్నెవరు చూస్తున్నారు కాంతమ్మా! పిల్లవాడు చాలా బుద్ధిమంతుడు. మా అన్వేష్‌కు నమ్మినబంటులా ఉంటున్నాడు'' అంది పార్వతమ్మ.

''వాళ్ళ కులం...'' అని ఆ కులం పేరు కాంతమ్మ చెప్పబోతోంటే పార్వతమ్మ.

''వాళ్ళ కులమేమిటో మాకు తెలుసు. వాళ్ళు ఫలానా కులమని చెప్పి మనం వాళ్లను నీచంగా చూస్తే జైల్లో పెడ్తారు. తెలుసా?'' అంది పార్వతమ్మ.

***

ఇంటర్మీడియెట్‌లో చేర్పించటానికి అన్వేష్‌ను వాళ్ళనాన్న హైదరాబాద్ తీసుకెళ్తోంటే

''నాతోపాటే శంకర్ కూడా. హైదరాబాద్‌లో చదువుకుంటాడు. మనమే అతన్ని చదివించాలి'' అన్నాడు అన్వేష్.

''వాళ్ళకు ప్రభుత్వం బోల్డు అవకాశాలు కల్పించింది. వాడు యే హాస్టల్‌లోనైనా ఉండి చదువుకుంటాడు. వాడిని మనం చదివించాల్సిన అవసరమే లేదు'' అన్నాడు ప్రతాపరెడ్డి.

''లేదునాన్నా. నేనెక్కడుంటే వాడూ అక్కడే ఉంటాడు. వాడు లేకుండా నేనేమీ చెయ్యలేను. నా సగం బలం వాడే'' అన్నాడు అన్వేష్.

''సరే నీ ఇష్టం'' అన్నాడు ప్రతాపరెడ్డి.

వాళ్ళిద్దర్నీ చాలా మంచి కాలేజి... ఆ కాలేజిలో చదివితే ఇంజనీరింగ్‌లో సీటు ఖాయం అని పేరున్న ఓ పెద్ద కార్పొరేట్ కాలేజీలో చేర్పించారు. ఆ కాలేజి

ఆవరణలోనే హాస్టల్ కూడా ఉంది. ఆ హాస్టల్లో అన్వేష్, శంకర్లు ఒకేరూంలో ఉంటూ చదువుకో వడం మొదలెట్టారు.

సిటీకొచ్చాక అన్వేష్‌కు క్రికెట్ ఆటమీద విపరీత మైన ఆకర్షణ యేర్పడింది. సిటీకి రాకపూర్వం అతడు టీ.వీలో క్రికెట్ ఆట ప్రత్యక్ష ప్రసారాల్ని చూస్తూ అతిగా ఉత్తేజితుడవుతుండేవాడు. హైస్కూళ్ళో చదువుతున్నప్పుడు కూడా అన్వేష్ శంక ర్లిద్దరూ ఎప్పుడు అవకాశం దొరికినా క్రికెట్ ఆడుతుం డేవాళ్ళు.

సిటీకొచ్చాక ఇద్దరూ సిటీలోని ఓ క్రికెట్ కోచింగ్ క్లబ్‌లో చేరారు. తర్వాత ఓ క్రికెట్ క్లబ్‌లో చేరిపోయి క్రికెట్‌ను సీరియస్‌గా ఆడటం మొదలెట్టారు.

అన్వేష్‌కు చదువుపట్ల శ్రద్ధ తగ్గిపోయి క్రికెట్ ఆడటం మీద శ్రద్ధ పెరిగిపోయింది. తనతోబాటు శంకర్‌ను కూడా క్రికెట్ ఆటలో పూర్తిగా మునిగిపో యేలా చేశాడు. శంకర్‌కు కష్టపడి చదివి ఇంజనీరిం గ్‌లో సీటు తెచ్చుకొని యేదైనా మంచి ఉద్యోగం సంపాదించాలని ఉండేది. కానీ అన్వేష్ అతనికా అవకాశం ఇవ్వలేదు.

''చదువువల్ల యేమొస్తుందిరా. క్రికెట్‌లో పేరు తెచ్చుకుంటే కోట్లు సంపాదించవచ్చు. సచిన్ టెండూల్కర్‌ను చూడు... సంవత్సరానికి ఎన్ని కోట్లు సంపాదిస్తున్నాడో తెలుసా?'' అన్నాడు అన్వేష్.

''నిజమే... కానీ మనం సచిన్ టెండూల్కర్లు కావడం సాధ్యమని నాకనిపించడం లేదు'' అన్నాడు శంకర్.

''ఎందుకు సాధ్యంకాదు. పట్టుదల, కృషి ఉంటే ఈ ప్రపంచంలో అసాధ్యమనేది యేదీ లేదు'' అనే వాడు అన్వేష్.

శంకర్ యే ఆటనైనా క్షణాల్లో నేర్చుకునేవాడు. క్రికెట్ ఆడటంలో కూడా అతడు గొప్ప నైపుణ్యాన్ని సంపాదించాడు.

బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ మొదలైన అన్నిం టిలోనూ అతడు అద్భుతంగా రాణించాడు. త్వర లోనే శంకర్‌ను క్రికెట్ ఆటలో ఎక్స్‌పర్ట్‌గా పేరుగాం చిన వాళ్ళందరూ ఆల్‌రౌండర్‌గా గుర్తించారు. అంత త్వరగా శంకర్‌కు ఆల్‌రౌండర్‌గా గుర్తింపు రావడం అన్వేష్‌ను చాలా ఆశ్చర్యపరచింది. ''వీడు సామా న్యుడు కాడు'' అనుకున్నాడు అన్వేష్.

అన్వేష్ బ్యాట్స్‌మన్‌గానే కొంత గుర్తింపు పొందాడు తప్ప ఆల్‌రౌండర్‌గా గుర్తింపు పొందలేక పోయాడు.

అన్వేష్‌కు అనుక్షణం శంకర్ క్రికెట్ ఎలా ఆడలో యే బంతిని ఎలా ఎదుర్కోవాలో చెబుతుండేవాడు.

''తిండికూడా గతిలేని వాడికి ఇంత టాలెంట్ యేమిటి? వాడికున్న టాలెంట్‌లో తనకు సగ మున్నా ఎంతో రాణించేవాడిని'' అనుకునేవాడు అన్వేష్.

''వాడి టాలెంట్‌ను తన లాక్కోగల్గితే బావుం డును'' అని కూడా అన్వేష్ అనుకునేవాడు.

బొటాబొటి మార్కులతో ఇంటర్మీడియెట్ ప్యాసై ఇద్దరూ బి.ఎస్సీలో చేరారు. ఇంజనీరింగ్‌లో సీటుకోసం ఇద్దరూ ఎంసెట్ పరీక్షకూడా రాశారు. కానీ క్వాలీఫైయింగ్ మార్కులు కూడా సంపాదించ లేకపోయారు. క్రికెట్ తన జీవితాన్ని పాడు చేసిం దని శంకర్ చాలా బాధపడ్డాడు.

డిగ్రీలో చేరాక వాళ్ళు క్రికెట్ ఆడటం ఇంకా ఎక్కువైపోయింది. సిటీలోని క్రికెట్ క్లబ్బుల మధ్య పోటీలు జరిగేవి. కాలేజీలో కూడా టోర్నమెంట్స్ జరిగేవి. అలాంటి ఓ టోర్నమెంట్‌లోనే ఈరోజు వాళ్ళిద్దరు క్రికెట్ ఆడారు.

అన్వేష్ యేం చెబితే అది శంకర్ తు.చ. తప్ప కుండా అనుసరించేవాడు.

'మరో సిక్సర్ కొట్టొద్దు' అని అన్వేష్ చెబితే శంకర్ అవకాశం వచ్చినా సిక్సర్ కొట్టేవాడుకాదు. తన ఖర్చంతా అన్వేషే భరిస్తున్నాడన్నా కృతజ్ఞతా భావం శంకర్‌ను ఎప్పుడూ వీడేదికాదు. ఈ కారణం చేతనే శంకర్ అన్వేష్‌ను అనుక్షణం కంటికి రెప్పలా కాపాడుతుండేవాడు. అతని మీద ఈగనుగానీ దోమనుగాని వాలనిచ్చేవాడు కాదు. అతడేపని చెప్పినా క్షణాలమీద చేసి పెట్టేవాడు. లాండ్రీకి వెళ్ళి బట్టలు తీసుకురావడం, ఒక్కోసారి అతని బట్టల్ని ఇస్త్రీ చెయ్యడం, అతని షూస్‌కి పాలిష్ వెయ్యడం, అతని టూవీలర్‌ని తుడిచి శుభ్రం చెయ్యడం మొద లైన పనులన్నీ శంకర్ సంతోషంగా చేస్తుండేవాడు. అన్వేష్ కూడా శంకర్‌కు ఎప్పుడూ యేదో పని చెయ్య మని పురమాయిస్తుండేవాడు.

శంకర్‌ది చాలా పెద్ద విగ్రహం. ఆరడుగులకు పైన్నే ఎత్తు... కండలు తిరిగిన నల్లటి శరీరం, గుబురు మీసాలు... అతన్ని సడెన్‌గా చూస్తే చిన్న పిల్లలు భయపడేలా ఉండేది అతని పర్సనాలిటీ... రోజూ ఉదయం జిమ్‌కువెళ్ళి కొన్ని ఎక్సర్‌సైజ్‌లు చేస్తుండేవాడు. అవసరమయితే ఓ పదిమందినైనా ఎదురుకోగలననే ఆత్మవిశ్వాసం అతనిలో ఉండేది. అతన్ని చూసి ఒక్కోసారి అన్వేష్ కూడా భయపడ్తుం డేవాడు.

శంకర్‌తో పోలిస్తే అన్వేష్‌ది చిన్న పర్సనాలిటీ. ఐదున్నర అడుగుల ఎత్తు, బక్కపల్చటి శరీరం... ఎర్రగా నిగనిగలాడ్తూ చాలా సున్నితంగా, అందంగా కనిపించేవాడు.

ఆరోజు జరిగిన క్రికెట్ మ్యాచ్‌ను గురించి శంక ర్‌తో అతని క్లాస్‌మేట్ ఉమేష్ ఆ మర్నాడు మాట్లా డాడు.

''నిన్న మీరిద్దరు బ్యాటింగ్ చేస్తున్నప్పుడు నువ్వు సిక్సర్ కొట్టగానే అన్వేష్ వచ్చి నీతో యేదో చెప్పాడు కదూ?''

''అవును'' అన్నాడు శంకర్.

''యేం చెప్పాడు?'' అన్నాడు ఉమేష్.

''యేదో చెప్పాడు. నీకెందుకూ?'' అన్నాడు శంకర్.

''నువ్వు మరో సిక్సర్ కొట్టొద్దు... మ్యాచ్‌ని నేనే ఫినిష్ చెయ్యాలి అన్నాడు. అవునా?''

''అవును... యేం?''

''అతనికి డబ్బున్నవాడినని చాలా పొగరు... నిన్ను కావాలనే రనౌట్ చేయించాడు. అతడు నిన్నో స్నేహితుడిగా చూడటం లేదు. సేవకుడిలా... ఇంకా చెప్పాలంటే కట్టుబానిసలా చూస్తున్నాడు. అది నీకు అర్థం కావడం లేదు. అతడు నీటాలెంట్‌నంతా అణి చేస్తున్నాడు... అతనితో స్నేహం చేసినంత కాలం నీకు భవిష్యత్తు లేదు''

''నోర్ముయ్యి... మా ఇద్దరి స్నేహం చూసి నువ్వే కుళ్ళుకొని ఛస్తున్నావు... నీ పిచ్చిమాటల్తో మా ఇద్దరి మధ్య విభేదాలు సృష్టించడానికి ప్రయత్నిస్తే నిన్నేం చేస్తానో నాకు తెలీదు'' చాలా ఆవేశంగా ఉమేష్ కాలర్ పట్టుకొని అన్నాడు శంకర్.


''సారీరా బ్రదర్'' అన్నాడు ఉమేష్ భయంతో వణికిపోతూ.

ఉమేష్ వెంటనే అక్కడ్నించి వెళ్ళిపోయాడు.

అన్వేష్, శంకర్ల స్నేహాన్ని చూసి ఆ కాలేజీలో చాలామంది చాలా రకాలుగా కామెంట్స్ చెయ్యడం మొదలెట్టారు.

''వాళ్ళిద్దరు స్నేహితులుకారు. అతడు యజ మాని... ఇతడు సేవకుడు'' అని కొందరు.

''శంకర్ నిజంగా చాలా తెలివైనవాడు. వెరీ టాలెంటెడ్ ఫెలో... అతని టాలెంట్‌ని అతడు తన కోసం వినియోగించుకోవడంలేదు. అన్వేష్ కోసం



వినియోగిస్తున్నాడు. శంకర్ టాలెంట్‌ను తనకోసం ఎలా వినియోగించుకోవాలో అన్వేష్‌కు బాగా తెలిసిపోయింది. అతన్ని పైకి రాకుండా అణిచేస్తున్నాడు'' అని కొందరు

''వాళ్ళిద్దరు ఇన్‌సెపరేబుల్స్... కొత్తగా పెళ్ళిచేసుకున్న భార్యాభర్తల్లా ఎప్పుడు చూసినా కలిసే ఉంటారు. వాళ్ళిద్దరి మధ్య ఉన్నది సహజమైన స్నేహమేనా అని నాకో డౌట్'' అని ఒకరంటే

''వాళ్ళిద్దరు హోమొసెక్సువల్స్ కావచ్చునని నాకూ అప్పుడప్పుడు డౌటొస్తుంటుంది'' అని ఇంకొకరు.

''వాళ్ళారూంలో స్నేహం చెయ్యడం లేదు... కాపురం చేస్తున్నారు'' అని ఎప్పుడూ బూతుజోక్స్ చెప్పే రమేష్ చాలామందితో అనడం, అందరూ నవ్వడం జరుగుతుండేది. క్రమక్రమంగా ఆ కాలేజిలోనూ, హాస్టల్‌లోనూ వాళ్ళిద్దర్ని గూర్చి ఇలా చెప్పుకోవడం, వాళ్ళిద్దరు కలిసి వెళ్తోంటే గుసగుసలు చెప్పుకుంటూ నవ్వుకోవడం ఎక్కువయిపోయింది.

ఒకరోజు వాళ్ళిద్దర్ని చూసి నవ్వుతున్న రమేష్ శంకర్ దృష్టిలో పడ్డాడు. ఆ మరుక్షణమే శంకర్ రమేష్‌ను పట్టుకొని చితకబాదాడు. అక్కడున్న కొందరు విద్యార్థులు శంకర్‌ను దూరంగా తీసికెళ్ళి శాంతపర్చారు.

ఇలా ఉండగా అన్వేష్ లేడీస్ హాస్టల్లో ఉండే ఓ అమ్మాయిని అదేపనిగా చూడటం, ఆమె ఎక్కడికెళ్తే ఇతడూ అక్కడికెళ్ళడం మొదలెట్టాడు.

ఆ అమ్మాయి పేరు హర్షిత

అన్వేష్ కళ్ళకు హర్షిత అందంగా, చలాకీగా సెక్సీగా కనిపించింది.

హర్షితకు అన్వేష్ తనను తినేసేటట్టుగా చూస్తున్నాడని తెలిసిపోయింది.

అప్పట్నించి ఆమె కూడా అతన్ని కవ్వించేలా చూడటం ప్రారంభించింది.

త్వరలోనే వాళ్ళిద్దరి మధ్య మాటలు కలిశాయి.

హర్షిత వెంట ఎప్పుడూ ఓ ఆడపిల్లల గుంపుండేది. వాళ్ళందర్నీ అన్వేష్ ఫైవ్‌స్టార్‌హోటల్స్‌కి తీసికెళ్ళి వాళ్ళు యేదడిగితే అది తెప్పించి వాళ్ళను సంతోషపరచేవాడు. వాళ్ళందర్నీ ఐమాక్స్ థియేటర్‌కు తీసికెళ్ళి సినిమాలు చూపించేవాడు.

అన్వేష్‌తో అలా ఖర్చుపెట్టించి అతడు వెళ్ళిపోగానే వాళ్ళు ఒకరిమీదొకరుపడి పగలబడి నవ్వుకునేవాళ్ళు. అన్వేష్‌తో ఎప్పుడూ ఉండే శంకర్‌ను గురించి కూడా వాళ్ళు జోక్స్ చెప్పుకుంటూ నవ్వుకునేవాళ్ళు.

ఒకరోజు శంకర్‌ని అన్వేష్ ''ఆ అమ్మాయికి ఐలవ్‌యూ చెప్పెయ్యమంటావా?'' అని అడిగాడు.

''నీ ఇష్టం... ఆమెను నువ్వు నిజంగా ప్రేమిస్తే చెప్పెయ్... కానీ ఆమె నిన్ను నిజంగా ప్రేమిస్తున్నదా అని నాకో సందేహం... ఆమె మనల్ని ఆటపట్టిస్తున్నదేమోనని కూడా నాకో డౌట్'' అన్నాడు శంకర్.

''మరోసారి డౌట్ గివుట్ అన్నావంటే తంతాను...హర్షిత నన్ను నిజంగా ప్రేమిస్తున్నది. ఆ విషయంలో నాకెలాంటి డౌట్ లేదురా... ఆమె నన్ను ప్రేమిస్తున్నదని నువ్వే కుళ్ళుకొని డౌట్, గివుట్ అంటున్నావు'' అన్నాడు అన్వేష్.

''సారీ అన్వేష్... నేను పొరబడి ఉంటాను'' అన్నాడు శంకర్.

''ఐలవ్‌యూ చెప్పెయ్యనా?''

''చెప్పెయ్...''

అన్వేష్ కాస్సేపు ఆలోచించాడు.

''నేనలా చెబితే ఆ అమ్మాయి యేదన్నా గొడవ చేసిందనకో... ప్రిన్సిపాల్‌కు చెప్పడమో, వాళ్ళ ఫాదర్‌కో, బ్రదర్‌కో చెప్పడమో...''

''అలాంటిదేదన్నా జరిగితే నేను చూసుకుంటాలే... నా కంఠంలో ప్రాణమున్నంత వరకు నిన్ను ఎవరూ యేమీ చెయ్యలేరు''

''ఔనా... నువ్వు నా సగం బలానివి. నువ్వు నా పక్కనున్నంత వరకు నాకేమీ కాదు'' అన్నాడు అన్వేష్.

''నేనెప్పుడూ నీ పక్కనే ఉంటాను... ఈ ప్రపంచంలో యే శక్తీ మనల్ని విడదీయలేదు'' అన్నాడు శంకర్.

ఒకరోజు హర్షితనొక్కదాన్నే అన్వేష్ ఓ పెద్ద హోటల్‌కుతీసుకెళ్ళాడు.

సినిమాలను గూర్చి, లెక్చరర్లను గూర్చి, తోటి విద్యార్థినీ విద్యార్థుల గూర్చి చాలాసేపు కబుర్లు చెప్పుకున్నాక అన్వేష్ సడెన్‌గా ''ఐలవ్‌యూ హర్షితా!'' అని చెప్పేశాడు. ఆ మాట వినగానే హర్షిత అదోమాదిరిగా నవ్వేసింది.

''నువ్వు అంగీకరిస్తే మనం వెంటనే పెళ్ళి చేసుకొని ఫస్ట్‌నైట్‌ని ఈ హోటల్లోనే జరుపుకుందాం'' అన్నాడు అన్వేష్.

''నేనేం చెప్పకుండానే ఫస్ట్‌నైట్ దాకా వెళ్ళావా అన్వేష్... నా చదువు పూర్తయ్యేదాకా నేను ఈ ప్రేమాదోమల జోలికి వెళ్ళదల్చుకోలేదు... జస్ట్ ఫన్ నీతో ఫ్రెండ్‌షిప్ చేశాను. అంతే.. ఐడోంట్ లవ్‌యూ ఎటాల్'' అంది హర్షిత..

''ఆల్‌రైట్... మనం ఫ్రెండ్స్‌గానైనా ఉండిపోదాం... జస్ట్‌ఫర్ ఫన్, మనమీరోజు ఈ హోటల్లో ఓరూం తీసుకొని ఈ రాత్రి ఎంజాయ్ చేద్దామా?'' అన్నాడు అన్వేష్.

''షటప్... నా గురించి అంత నీచంగా ఆలోచించిన నిన్ను చూస్తే అసహ్యం వేస్తోంది'' అంది హర్షిత... అంటూనే లేచినిల్చొని వెళ్ళిపోవడానికి సిద్ధమైంది.

''నాతో ఇన్ని రోజులు తిరిగి... నీ ఫ్రెండ్స్‌కు నాతో తినిపించి, తాగించి, నాచేత వేలకు వేల రూపాయల్ని ఖర్చుపెట్టించి ఇలా మోసం చేస్తావా?''

''మోసం చెయ్యలేదు... నువ్వే మోసపోయావు... నీతో ఖర్చు పెట్టించి ఎంజాయ్ చెయ్యడం కోసమే నీతో ఫ్రెండ్‌షిప్ చేస్తున్నట్టు నటించాను. నీ దగ్గర చాలా డబ్బుందని, నువ్వో బంగారు పిచ్చుకవని మే గమనించాం. నిన్ను ఆట పట్టిద్దామనే నీమీద ఇంటరెస్ట్ చూపించాను. అయినా నీకు శంకర్ ఉన్నాక వేరే లవర్ ఎందుకు? కాలేజీలో అందరూ మీరిద్దరు ఫ్రెండ్స్‌కారు... లవర్స్ అని చెప్పుకుంటారు'' కసిగా అంది హర్షిత.

''యేం కూశావ్... యూబ్లడీ బిచ్!'' అన్నాడు అన్వేష్...

''నన్ను... నన్ను... బ్లడీ బిచ్ అంటావా? నీ అంతు చూడకపోతే నా పేరు హర్షిత కాదురా స్కౌండ్రల్!'' అంటూ హర్షిత విసురుగా నడుచుకుంటూ వెళ్ళిపోయింది.

అన్వేష్ వెంటనే హాస్టల్‌కొచ్చి శంకర్‌కు యేం జరిగిందో చెప్పాడు.


''ఆ బిచ్ మన మీదకు రౌడీలను పంపిస్తుందేమోరా!'' అన్నాడు అన్వేష్.

''పంపించనీ... వాళ్ల సంగతి నేను చూసుకుంటాలే... నువ్వేం వర్రీకాకు'' అన్నాడు శంకర్.

ఆ మర్నాడు అన్వేష్ శంకర్లిద్దరు కలిసి రాత్రి భోజనం చెయ్యడానికి మెస్‌కు వెళ్తోంటే ఐదుగురు యువకులు వాళ్ళకు అడ్డం తిరిగారు.

వాళ్ళల్లో ఒకడు అన్వేష్ కాలర్ పట్టుకొని ''మా సిస్టర్‌ను బిచ్ అంటావురా బాస్టర్డ్! ఆమె ఎవరనుకున్నావురా స్కౌండ్రల్!'' అన్నాడు.

వాళ్ళ చేతుల్లో ఉన్న సైకిల్ చెయిన్స్‌నీ, హాకీబ్యాట్స్‌ని చూడగానే అన్వేష్ కడుపులో భయం సముద్ర



కెరటంలా ఉవ్వెత్తున ఎగిసిపడింది.

కానీ అతని పక్కనే ఉన్న శంకర్ హర్షిత అన్నయ్యను అన్వేష్ నుండి దూరంగా నెట్టేశాడు.

"దాంట్లో మా అన్వేష్ తప్పేమీలేదు. మీ సిస్టర్ అన్వేష్‌ను ప్రేమించినట్టుగా నటించి ఇలా మోసం చేస్తుందా? అన్వేష్‌ను తన చుట్టూ తిప్పుకొని వేలకువేల రూపాయలు ఖర్చు పెట్టిస్తుందా?" అన్నాడు శంకర్.

"మీలాంటి మిస్చిఫ్ మేకర్స్‌కి అలాగే బుద్ధి చెప్పాలి... మా సిస్టర్ చాలా మంచి పనే చేసింది." అన్నాడు హర్షితవాళ్ళ అన్నయ్య శంకర్‌వైపు తిరిగి.

"అయినా నువ్వెవడివిరా... నువ్వు వాడికి బాడీ గార్డువా... మొదలు నిన్ను తన్నాలి" అంటూ మిగతా వాళ్ళు శంకర్‌ను చుట్టుముట్టారు.

ఇదే బెస్ట్‌ఛాన్స్ అనుకొని అన్వేష్ వెంటనే అక్కడ్నించి పరిగెత్తుకొని వెళ్ళి తన రూంలో చేరి లోపల్నుంచి బోల్టు పెట్టుకున్నాడు.

శంకర్ ఒక్కడే కొంతసేపు వాళ్లను ఎదుర్కొన్నాడు. కానీ కాస్సేపట్లోనే వాళ్ళదే పై చేయి అయ్యింది. వాళ్ళు శంకర్‌ను స్పృహ పడిపోయేదాకా కొట్టి అక్కడికి చాలామంది హాస్టల్ విద్యార్థులు రావడంతో వెళ్ళిపోయారు.

రక్తం మడుగులో పడిపోయిన శంకర్‌ను గుర్తుపట్టిన హాస్టల్ విద్యార్థులు వెంటనే అతన్ని దగ్గర్లో ఉన్న హాస్పిటల్లో చేర్పించారు.

శంకర్ తలకూ, చేతులకూ, కాళ్ళకూ బలమైన గాయాలయ్యాయి. చాలా రక్తం పోయింది. ఓ కాలు విరిగింది. డాక్టర్లు వెంటనే అతనికి వైద్యం చేశారు. హాస్టల్ విద్యార్థుల్లో ఒకడైన ఉమేష్ రక్తం శంకర్ రక్తంతో మ్యాచ్ కావడంతో ఉమేష్ రక్తాన్ని ఎక్కించారు.

శంకర్‌ను హాస్పిటల్లో జాయిన్ చేయించామని ఉమేష్‌తోబాటు మరికొందరు హాస్టల్ విద్యార్థులొచ్చి అన్వేష్‌కు చెప్పారు. అయినా అతనిలో చలనం లేదు.

"నేను వెళ్ళి చూస్తాను" అన్నాడతడు తగ్గుస్వరంతో తనతో తను చెప్పుకుంటున్నట్టుగా.

కానీ అన్వేష్ హాస్పిటల్‌కు వెళ్ళి శంకర్‌ను చూడలేదు.

ఆ మర్నాడే అతడు వాళ్లఊరికి వెళ్ళిపోయాడు.

శంకర్ని చూడకుండానే ఇలా వెళ్ళిపోవడం తప్పేనని అతని అంతరాత్మ ఘోషించింది.

"తప్పేంలేదు... అసలు ఆ శంకర్‌గాడితో ఫ్రెండ్‌షిప్ చెయ్యడమే తను చేసిన పెద్ద పొరపాటు. వాడు తనకో బాడీగార్డులా ఎప్పుడూ తన పక్కన ఉండటంతో తనకింక ఎదురులేదనే ధైర్యం తనకు కల్గింది. ఆ ధైర్యంతోటే తను హర్షితతో ఆ రోజు హోటల్లో అలా మాట్లాడాడు. తను వాడితో అంత క్లోజ్‌గా తిరగటంతో ఎంతమంది తమమీద ఎన్ని జోక్స్ చెప్పుకొని తనను అవమానించారో గుర్తొస్తే అతని రక్తం సలసల మరిగిపోయింది. ఈ శంకర్ గాడు తన పక్కన లేపోతే హర్షిత తనను తప్పకుండా ప్రేమించేది. "నీకు శంకర్ ఉన్నాక మరో లవర్ ఎందుకు?" అని ప్రశ్నించేదికాదు.

తమ ఊరివాళ్ళు ఎంతోమంది "ఆ శంకర్‌గాడితో మీ వాడికి ఫ్రెండ్‌షిప్ యేమిట"ని నాన్నను అడిగారు. వాడు అట్టడుగు వర్గాల్లోని అట్టడుగు వర్గానికి చెందిన వాడని చెప్పారు. అయినా నాన్నగారు వాళ్ళ మాటల్ని పట్టించుకోలేదు.

"చిన్నప్పట్నించే వాళ్ళిద్దరు ప్రాణస్నేహితులు. ఇప్పుడు విడిపొమ్మంటే పోతారా? అయినా ఈ రోజుల్లో కులపట్టింపేమిటి?" అన్నాడు నాన్న.

కానీ నాన్నగారొకసారి తనతో అన్నమాటలు ఇప్పుడు గుర్తొస్తున్నాయి.

"చిన్ననాడే వాడిని నువ్వు వదిలించుకుంటే బావుండేది" అన్నాడు నాన్న

"ఎందుకు?" అడిగాడు తను

"వాడిది యే కులమొ నీకు తెలుసా?" అన్నాడు నాన్న

"సూచాయగా దళితుడని తెలుసు" అన్నాడు తాను.

"దళితుల్లో కూడా చాలా కింది వర్గానికి చెందిన వాడట. దళితులను అడుక్కొని బతికే కులమట. అలాంటి వాడితో నీకు ఫ్రెండ్‌షిప్ యేమిటని నేను ఎన్నోసార్లు ఆలోచించాను. పిల్లలు స్నేహంగా ఉంటున్నారు. వాడు కూడా నీకు నమ్మినబంటులా ఉంటున్నాడు... పోనీయనే ఊరుకున్నాను. ఊరుకున్న కొద్దీ నువ్వు వాడిని నెత్తికెక్కించుకుంటున్నావు. ఎలాగైనా వాడిని వదిలించుకో" అన్నాడు నాన్న.

అవును... తను శంకర్‌ను వదిలెయ్యాల్సిందే... వాడు హర్షితకు 'ఐలవ్‌యూ చెప్పు... యేం జరిగినా నేను చూసుకుంటాలే అని చెప్పడం వల్లనే తనుహర్షితకు 'ఐలవ్‌యూ' చెప్పేశాడు. వాడి అండ చూసుకునే తనింత సాహసం చేశాడు. ఆరోజు వాళ్లు తనను పచ్చడికింద మార్చేసేవాళ్లు... సినిమాల్లో హీరో పదిమంది రౌడీలను తన్నినట్టుగా శంకర్ కూడా పదిమందొచ్చినా వాళ్ళను తన్నేయ్యగలడని తను అనుకున్నాడు. కండలు తిరిగిన వాడి భారీ విగ్రహాన్ని చూస్తే తనకు చాలా ధైర్యం కల్గేది. ఎప్పుడూ క్రికెట్ ఆడటం, జిమ్‌కెళ్ళి రకరకాల ఎక్సర్‌సైజులు చెయ్యడంవల్ల వాడి శరీరం రాటుదేలింది. ఇంతకాలం వాడి ఖర్చంతా తనే భరించాడు. అంత బలిష్ఠమైన కండలు గల్గినవాడు హాస్పిటల్లో చేరడమేమిటి? వాడంత సులభంగా ఓడిపోతాడనుకోలేదు. అతడు భవిష్యత్తులో తనను రక్షిస్తాడన్న నమ్మకం పోయింది.... అయినా అంత నీచకులానికి చెందిన వాడితో తనకు ఫ్రెండ్‌షిప్ యేమిటి? ఇక నుండి వాడి ఛాయకూడా తనమీద పడకూడదు.

ఇలా ఆలోచిస్తూ అన్వేష్ వాళ్ళ ఊరికివెళ్ళిపోయి వాళ్ళ నాయనమ్మ ఒడిలో చేరిపోయాడు.

***

కొద్ది రోజుల తర్వాత శంకర్‌ను హాస్పిటల్ నుండి డిస్చార్జి చేశారు.

అన్వేష్ హాస్టల్‌లో వాళ్ళుండే రూం ఖాళీచేసి సిటీలో వాళ్ల నాన్నగారు కట్టించిన ఓ అపార్ట్‌మెంట్‌లో చేరిపోయాడు.

శంకర్ కొందరు ఫ్రెండ్స్ సహాయంతో బి.ఎస్‌సీ పూర్తి చేశారు.

శంకర్, అన్వేష్‌లు మళ్ళీ కలుసుకోలేదు.

***

చాలా కాలం గడిచిపోయింది.

అన్వేష్ రియల్ ఎస్టేట్ బిజినెస్‌లో స్థిరపడిపోయాడు.

శంకర్ క్రికెటర్‌గా గొప్పపేరు సంపాదించి రంజీ ట్రోఫీ మ్యాచెస్‌లో హైదరాబాద్ టీంలో మెంబర్‌గా క్రికెట్ ఆడటం మొదలెట్టాడు.

ఒకరోజు అన్వేష్ టీవీలో స్పోర్ట్స్ న్యూస్ చూస్తోంటే శంకర్ ఆస్ట్రేలియా తరపున ఆడబోయే ఇండియన్ నేషనల్ టీంకు సెలక్టయ్యాడన్న వార్త ప్రసారమయ్యింది. శంకర్ క్రికెట్ జీవితం ఎప్పుడు ప్రారంభమైందో చూపిస్తూ శంకర్ జీవిత విశేషాలను ప్రసారం చేస్తోంటే అన్వేష్ నోరు తెరచుకొని చూస్తూ ఉండిపోయాడు.

"నేనతన్ని వదిలెయ్యకపోతే అతడింత వాడయ్యేవాడు కాదు. అతన్ని వదిలేసి నేను అతనికి మేలే చేశాను" అన్న భావం అతనికి తెలియకుండానే అతని బుర్రలో మెదిలింది.

✻

